'అరవింద్'

# దీపం



రాత్రి తొమ్మిది దాటింది. పిన్ని రత్నమాల నిద్రపోయింది; కానీ ఉమకి నిద్ర రాలేదు. ఊరికి వెళ్ళిన తండ్రి ఆ రాత్రి తప్పకుండా రావాలి. ఎదురు చూస్తూ వీధి వరండా మెట్లమీద కూర్చుంది ఉమ. గేటు తీసుకుని లోపలికి వచ్చారు గోపాలక్రిష్ణగారు.

తండ్రిని చూడగానే ఉమ గుండె దడదడా కొట్టుకుంది

'నాన్న ఏం వార్త తెచ్చారో...' అనుకుంది.

అతడి వెనకాలే లోపలికి వెళ్ళి పిన్నిని లేపింది. రత్నమాల లేచి అతనికి భోజనం ఏర్పాటు చేసింది. ఉమ —

తండ్రి భోజనం అయ్యేవరకూ అటూ ఇటూ తిరుగుతూనేఉంది, పని కల్పించు కుని కానీ ఆయన ఏమీ మాట్లాడ కుండానే భోజనం చేసి పడుకున్నారు.

'శుభమైతే వెంటనే చెప్పేవారే! విన్నసంగతి నిజమేనా! రేపు పిన్ని అసలుసంగతి చెప్పేవరకూ ..' ఆమె మనసు మధనపడ నారంభించింది.

గోపాలక్రిష్ణగారికి మాధవరావు ఒక అన్నగారు, సావిత్రమ్మ ఒక అక్క గారు! సిరిసంపదలు, పేరుప్రతిష్ఠలు గల కుటుంబం. మాధవరావు ప్లీడరు వృత్తిలో ఉండి బాగా ఆర్జిస్తున్నాడు. పట్టా ఉన్నప్పటికీ ఆ వృత్తిమీద కుతూ హలంలేక లెక్చరర్‌గా ఇంకొక ఊరిలో స్థిరపడ్డారు గోపాలక్రిష్ణగారు. ఉమకి పన్నెండేళ్ళ వయసున ముగ్గురు పిల్లల్ని వదిలి ఉమ తల్లి మరణించింది. తల్లి లేని పిల్లల్ని కొన్నాళ్ళు తనదగ్గర ఉంచు కుంది సావిత్రమ్మ. ఉమని తన కోడ లుగా చేసుకుంటానంది ఐదేళ్ళ తర వాత గోపాలక్రిష్ణగారు మళ్ళీపెళ్ళి చేసు కున్నారు.

ఆ నెలలో మాధవరావుగారి పెద్ద కూతురు వసంత వివాహం నిశ్చయ మైంది. పెళ్ళివిషయాలు, డబ్బు వ్యవ హారాలు సంప్రతించటానికి రమ్మని అన్నగారు ఉత్తరం వ్రాయగా, గోపాల క్రిష్ణగారు ఊరికెళ్ళారు. ఉమకీ, సావిత్రమ్మగారి కొడుకు శేఖరానికీ పెళ్ళి అవుతుందనే అభిప్రాయం ఆమె లోనే కాక బంధువులలో కూడా పోయింది అట్లా ఉండగా ఈమధ్య సావిత్రమ్మగారు తన కొడుక్కి ఉమని చేసుకోనందనీ, మాధవరావుగారి రెండవ కూతురు గిరిజని చేసుకుంటా నందనీ — వార్త వినవచ్చింది కానీ అందులో సత్యాసత్యాలు తెలియవు ఈ ప్రయాణం వలన ఆ సంగతికూడా తేలిపోతుంది

గోపాలక్రిష్ణగారు ఊరికి వెళ్ళి వచ్చారు; కానీ ఏసంగతీ తెలియలేదు ఉమకి. ఇరవై ఏళ్ళ వయసుగల ఉమలో విసుగులేని నిరీక్షణ, అద్దరిలేని అను రాగం ఉన్నాయి బావకోసం. అతడితో తనకి పెళ్ళి అవుతుంది అనే జ్ఞానం ఆమె కన్నెమనసులో పొంగి పొరలే అను రాగాన్నీ, కాంక్షల్నీ అతడిపైపే ఏక ముఖంగా ప్రవహించేటట్లు చేసింది

శేఖర్‌వాళ్ళది పల్లెటూరు. సెలవలకి గోపాలక్రిష్ణగారి పిల్లలూ, మాధవరావు గారి పిల్లలూ ఆఊరికి వెళ్ళేవారు. పొలాలమధ్య, కాలవ గట్లమీద తిరిగే వారు మామిడికాయలు కోసుకునేవారు. వేరుశగకాయలు కాల్చుకుని తినేవారు అన్ని సరదాలలో ఉమ, శేఖర్ సన్ని హితంగా ఉండేవారు మిగతా పిల్లలు శేఖర్, ఉమలని హాస్యం చేస్తుండేవారు. శేఖర్ బంతిపూలు ఇవ్వటంలో ఉమపై పక్షపాతం చూపిస్తుండేవాడు. పుట్టిన రోజున ఉమకి బహుమతులు ఇచ్చేవాడు.

అందులో 'ఎంకి పాటల' పుస్తకం ఉమ ప్రాణప్రదంగా చూసుకునేది

ఒకసారి సావిత్రమ్మగారికి జ్వరం వస్తే దగ్గర ఉండటానికి ఉమని పిలిపించుకుం దావిడ అక్కడ వారం ఉంది ఉమ

శేఖర్ బొంబేలో చదువుతున్నాడు కాలేజ్‌కి సెలవు పెట్టి తల్లిని చూడటానికి వెళ్ళాడు ఒకరోజు మధ్యాహ్నం సావిత్రమ్మగారు నిద్రపోతుంటే ఉమకి తోచక బావతో కబుర్లు ఆడ్డామని అతడి గదిలోకి వెళ్ళింది అతడు సెక్సాలజీ చదువుతున్నాడు

పుస్తకం లాక్కుని చూసింది ఉమ

"ఛీ ... ఇట్లాంటివి చదవకూడదు." అంది

"చదవకపోతే ప్రేమించటం ఎట్లా తెలుస్తుంది," అన్నాడు శేఖర్.

"పూవుకు వికసించటం ..తేనెటీగకు మధువు త్రాగటం పాఠాలు చదువుతేనే వచ్చాయా ?" అని ప్రశ్నించింది

శేఖర్ దగ్గరకు వచ్చి ఉమ భుజాల మీద చేతులు వేసి, 'చాలా సంగతులు నేర్చావే " అన్నాడు

తన భుజాలమీద పడిన అతడి చేతులూ, బుగ్గలపైకి ప్రసరించిన అతడి కళ్ళలో చూపూ ఆమెలో ఒకజలదరింపు వివశత్వాన్ని కలుగజేశాయి అయినా అతడిచేతులు విదిలించేసింది.

"ఇక్కడికి పొరపాటున వచ్చాను." అని గబగబా వెళ్ళిపోయింది. వెళ్ళిపోయింది కానీ, బావకి కోపం వచ్చిందేమోనని ఆమె మనసు పరిపరి విధాల దిగులుపడింది, జడ వేసుకుంటూ అద్దం ముందు నిలబడిన ఉమదగ్గరకి ఒకగంట పోయాక వచ్చాడు శేఖర్ ...

అక్కడ ఉన్న కిటికీ కానుకుని_

'మనయెంకె యని కానిసనువులకు
పోరాదు;
కలిగినా తొలగినా దూపదూరానే...'

అని పాడాడు

ఉమకి మనసంతా ఆనందంతో నిండిపోయింది

"నీకు అర్ధమయింది ... అది అయిష్టమూ, కోపమూ కాదని అది... నా మనసు అర్థమయింది. అంతేచాలు బావా." అంది

'అటువంటి బావ ఆనను కాదనదు ! అత్తయ్య .

అమ్మ పోయినప్పుడు తనను దగ్గరకు తీసుకుని, తలమీద చేయి వేసి, కళ్ళలో నీళ్ళు తుడిచి, 'ఇది నా కోడలు' అని తనలో మమకారానికి విత్తనం వేసిన అత్తయ్య ఇప్పుడు కాదంటుందా ! ఎందుకు ? ఏమైఉంటుంది !'

మధనపడే హృదయాన్ని అదుపులో పెట్టలేక రానినిద్ర కుపక్రమించింది ఉమ

* * *

తండ్రి తెచ్చినవార్త తెలుసుకోటానికి ఉమ ఆరాటపడుతోందన్న సంగతి రత్నమాలకు తెలుసు. ఆ మరునాడు పొద్దున

పెద్దపిల్లలు స్కూళ్ళకి వెళ్ళాక, రత్నమాల కొడుకుని నిద్రపుచ్చి వంట కుపక్రమించింది ఆ పూట వంటకి కూరలు తరిగిపెట్టి అక్కడే నిలబడిఉంది ఉమ కిటికీదగ్గర. ఆ నిలబడటంలో పరధ్యాన్నం కొట్టవచ్చినట్లు కనబడుతోంది

రత్నమాల ఉమ దగ్గరకు వచ్చి తల మీద చేయి వేసి, "తల దువ్వుకోలేదేం ఉమా!" అంది

ఉమ ఆ చేతిని మెల్లగా తొలగించి వేస్తూ "ఏమిటో బుద్ధికావటంలేదు పిన్నీ. ఐనా, నాన్న వెళ్ళిన సంగతి ఏమైందో నువ్వైనా చెప్తావనుకున్నాను అంత దాచవలసింది ఉందా పిన్నీ!" అంది.

రత్నమాల చటుక్కున కళ్ళు మరల్చుకుంది కిటికీలోంచి బయటకు చూసింది

నిన్నరాత్రి – తనంతట తను ఆ సంగతి చెప్పలేదు భర్త ఎదురు చూసి చివరకు ఉండలేక అడిగేసింది "అసలు సంగతి ఏమైందో మీరు చెప్పనేలేదు..." అని

గోపాలక్రిష్ణగారు తన చేతిని ఆమె అరచేతిలో ఉంచారు

"నీదగ్గర దాచ ప్రయత్నించ వ్యర్థమే కదా. కష్టసుఖాలు కలిసి అనుభవించడానికి సిద్ధపడినవాళ్ళం," అన్నాడు. అలతిగా నవ్వుతూ.

రత్నమాల అతడికేసి అనుమానంగా చూసింది.


అతడు చెప్పాడు.

"మనం విన్నమాట నిజమే; మా వదిన చెప్పింది శేఖరానికి ఉమని చేసుకోవటం మా అక్కయ్యకి ఇష్టంలేదుట. గిరిజని చేసుకుంటానని అన్నయ్యతో చెప్పిందిట పదివేలు కట్నం కాక, పిల్లకి ఎకరం పొలం, రెండువేల నగలు ఇస్తారుట. అసలు ఈ కట్నం, గిరిజ అందచందాలూ కారణం కాదనుకో వింటున్నావా? మనసు కొంచెం గట్టి చేసుకో. కారణం మన పెళ్ళిట – నేను నిన్ను చేసుకోవటం. వద్దు, కన్నీళ్ళు పెట్టకు నిన్ను చేసుకున్నది ఏడిపించటానికికాదు. అక్కయ్య ఇటువంటి నిర్ణయం తీసుకుంటుంది అని తెలిస్తే ఉమ పెళ్ళి చేశాక నిన్ను చేసుకుని ఉండేవాడిని...' అన్నాడు

ఉమకి పెళ్ళి ఆగిపోవటానికి తను కారణం! మనసులో పరితాపం ఉన్నంత మాత్రాన ఉమ కోల్పోయినదాన్ని తను తిరిగి ఇవ్వలేదు

కిటికీ ఊచల్ని గట్టిగా పట్టుకుని రత్నమాల అంది "ఉంది ఉమా! అత్తయ్యకి మీ నాన్న ఈ పెళ్ళి – నన్ను పెళ్ళిచేసుకోవటం – ఇష్టంలేదుట "

పిన్ని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి ఉమకి నోటివెంట మాట రాలేదు ఊహాలు వెనక్కి – వెనక్కి – గతంలోకి పోతున్నాయి



'నిజమా – అంతేనా – ఇదా కారణం! కావచ్చు.'

ఇంతవరకూ కొడిగట్టి వెలుగుతున్నట్లున్న ఆశ గుప్పుమని ఆరినట్లనిపించింది. ఆ అంధకారంలో తల గిర్రున తిరుగుతుంటే నిలబడలేక తన గదిలోకి వెళ్ళింది. ఉమ దుఃఖపడుతోందని తెలుసు; కానీ 'నా కారణంగా రగిలిన వేదనని నేనే ఓదార్చగల శక్తి నాకు లేదు.' అనిపించి నిస్సహాయంగా నిలబడిపోయింది రత్నమాల.

* * *

పరువుమీద వాలిన ఉమకి హృదయాంతరాళంలోంచి దుఃఖం కెరటాలుగా తెరలివస్తోంది. ఆమె కలలు, ఆశలు, జీవితం శేఖరంబావ – అన్నీ ఆ కెరటాలలోపడి కొట్టుకుపోతున్నాయి. ఆమెకి దూరమైపోతున్నాయి... అన్నిటినుంచీ విడివడి ఒక సంఘటన ఆమెముందు స్పష్టంగా నిలిచింది.

'నీవే కారణం, ఇట్లాగ జరగటానికి నీవే కారణం,' అంటూంది.

కాలేజ్‌లో చేరిన ఏడాది – వక్తృత్వపు పోటీలో పాల్గొంది ఉమ.

అద్భుతంగా, ఆవేశంగా మాట్లాడింది. 'స్త్రీజనాభ్యుదయం' – ఆనాటి వివాదాంశం.

నాగరికతకీ, దేశ సంస్కృతికీ మూలాధారం, కీలకం, ఆ సమాజం స్త్రీకి ఇచ్చే ప్రతిపత్తి – సంఘంలో స్త్రీకి ఉన్న స్థానం. పాశ్చాత్యులకూ మనకూ ఉన్న మూలభేదం ఇదే. స్త్రీ స్థానంలో మార్పుతో దేశ నాగరికతాసంస్కృతులే మారిపోతాయి. మన దేశం రష్యా, అమెరికా దేశాల్లాగ అభ్యుదయం పొందాలంటే స్త్రీల ఆర్థికస్వాతంత్ర్యాన్నీ,

విడాకుల్నీ, పునర్వివాహాన్నీ ప్రోత్స హించి ఆచరించాలి ' అని ఉపన్యసించిన దానికి మొదటి బహుమతి అందుకుంది ఆ ఉపన్యాసం కాలేజీ మాగజైనులో ముద్రితమయింది దానిని తండ్రికి తెచ్చియిచ్చింది ' అది చదివిన తండ్రి ముఖంలో ఒకతృప్తి కనిపించి సంతో షించింది ఉమ తరువాత ఒకనెలకే ఆయన మాధవరావుదగ్గరకు వెళ్ళివచ్చి చెప్పారు, రత్నమాలని రిజిష్టరుమారేజి చేసుకున్నట్లు రత్నమాల పాతికేళ్ళ వితంతువు ఉమ ఆశ్చర్యపడింది అంత కంటె ఆశ్చర్యం కలిగించింది — ఆ వ్యాసం చదివి తన అభిప్రాయాన్ని అంగీకారంగా తండ్రి భావించడం

• రత్నమాల మాధవరావుగారి భార్యకి చెల్లెలు. ఆమెకి పెళ్ళిఅయిన రెండేళ్ళకే భర్త గతించాడు ఐదేళ్ళనుంచీ ఆమె పుట్టింటిలో ఉంది సంప్రదాయంగల కుటుంబంలో పుట్టి సాంప్రదాయాన్ని అధిగమించి జీవించటానికి చాలా స్థయిర్యం కావాలి, సంస్కారం కావాలి రత్నమాల అన్నివిధాలా ఉమకి తృప్తి కలిగించింది కానీ .

ఉమ చాలా సేపు మేలుకుని చదువు తుంటే 'ఇంక పడుకో ఉమా!' అని తలమీద చేయి వేసినా, తలనొప్పి వచ్చి నప్పుడు ఆమె తన కణతలక్రింద అమృ తాంజనం రాయబోయినా పిన్ని యొక్క ఆ చేతి స్పర్శక్రింద కుచించుకుపోయేది ఉమ!

'ఎందుకు!' తనలో తనే ఆలోచించు కుంది 'పిన్నికి ఇదివరకు ఒకపెళ్ళి అయింది ఆ అపవిత్రపుచాయలు తన మీద పడినట్లు సహించలేకపోయేది

'దీనికే తను సమాధాన పడలేదు — మరి నాన్న!

'తండ్రి హిమవన్నగంలాగ కనిపిం చాడు సంప్రదాయాలకి అతీతంగా ఎదిగి పోయాడు ఆదర్శాలు చెప్పేవారేకాని ఆచరించేవారు ఎంతమంది! తండ్రి అంటే ఆరాధనాభావం కలిగింది, కానీ పిన్నిని ఆమె ఆలోచన అంగీకరించినా, హృదయం తన పరిధిలోకి రానివ్వలేక పోయింది ఇంక అత్తయ్య హర్షించ లేదు, ఆమోదించలేదు అని ఆశ్చర్య పడటం, అవమానం చెందటం, నిందిం చటం ఎందుకు?' అనుకుంది

ఉమలో మొదటి దుఃఖపు పొంగు కొంతతగ్గి నిట్టూర్పు వెలువడింది 'నాన్న పెళ్ళి చేసుకోవటంవలన పిన్ని అదృష్టవంతురాలే! కానీ నేను!' అని ప్రశ్నించుకుంది.

ఒకఏరు ఎక్కడో పుట్టి, గలగలా ప్రవహిస్తూ, ఒకనదిని చేరటానికి ఉత్సు కతతో వస్తోంది సంగమానికి దగ్గ రలో ఎదురుచూడని కొండ ఒకటి అడ్డు తగిలింది. నిర్ఘాంతపడి ఆగిపోయింది యేరు. దుఃఖిస్తూ నిలబడింది. ఆశ విర

మించి వెనుదిరగడమా? రెట్టించిన ఉత్సాహంతో ప్రయత్నించి కొండ నధిగమించి నదిని కలియటమా? చిన్న ఏటికి కొండను దాటటం సాధ్యమేనా! కొండ కరిగి నీరైనా కావాలి, లేదా నది కరుణించి తనే ముందుకు వచ్చి యేటిని తనలో కలుపుకోవాలి. ఏదీ సంభవంకాదు! ఎందుకు సంభవంకాదు? బావ తన మన సెరుగడా? తను అర్థిస్తే కాదంటాడా? కానీ అత్తయ్యా నాన్న కారణంగా నన్ను తిరస్కరించింది. నేను బావని అర్థించటం నాన్న ఆద ర్శాన్ని అవమానించటం కాదా! ప్రేమకి పరాకాష్ఠ పెళ్ళి పెళ్ళికాని ప్రేమ వ్యర్థమే ప్రేమకీ - పెళ్ళికీ కలకీ - వాస్తవానికీ ఉన్నంత తేడా ఉంది

కలని వాస్తవం చేయటానికి ..

'జీవితమే బలి కావచ్చు! జీవితాలే గడిచిపోవచ్చు! అది అసంభవమే కావచ్చు ఈ వాస్తవంగురించి ఇన్నాళ్లూ సందేహమేలేదు అందుకే ఇంతదుఃఖం.

అత్తయ్యకి అయిష్టంగా జరిగిన పెళ్ళివలన ఆ కుటుంబంలో సుఖశాం తులు ఉంటాయా? అత్తయ్యకి బావ ఒక్కడేకొడుకు

అత్తయ్యను దుఃఖపెట్టలేను నాన్న అభిమానాన్ని అవమానపరచలేను. బావ గిరిజనే పెళ్ళిచేసుకోనీ -' అనుకుంది ఉమ ఆమె దుఃఖించటం మానేసింది.

వసంత పెళ్ళిముహూర్తం దగ్గర పడింది పెళ్ళికూతురుకోసం పట్టుచీరా, ఉంగరం కొన్నారు. కానీ ఆయన కసలు పెళ్ళికి వెళ్ళాలనిలేదు

'వెళ్ళక తప్పదు.' అనుకున్నారు గోపాలక్రిష్ణగారు

ఆయన పాతికేళ్ళ వితంతువు రత్న మాలని పెళ్ళిచేసుకున్నప్పుడు చాలామంది ఆయన్ని అభినందించారు ఆయన పేరు పత్రికల్లో పడింది అన్నగారూ వదినా కూడా సంతోషించినట్లే కనిపించారు కానీ అతడి అక్కగారైన సావిత్రమ్మ గారు అతడిని చూడగానే -

"అదేమిరా గోపాల్ - మన సంప్ర దాయ మేమిటి! వంశ మెటువంటిది? మచ్చలేని వంశానికి అప్రతిష్ఠ తెచ్చావు. నువ్వు చేసినపని ఏమీ బాగా లేదు," అనేసింది అప్పుడు ఆయన నవ్వి ఊరు కున్నాడు

ఆవిడ అభిప్రాయంతో నిమిత్తం లేకపోతే ఇబ్బందే ఉండేదికాదు కానీ ఇప్పుడు

శేఖర్‌కి ఉమని చేసుకుంటారనే ఉద్దేశంతో ఉమకి పైసంబంధాలు చూడనే లేదు అంతేగాక ఉమ శేఖర్నికాక ఇంకెవరినైనా చేసుకుంటుందా అనేదీ సందేహమే ఉమసంగతే అతడిని బాధిస్తోంది. తమందరి కారణంగా వంచితురాలైంది ఉమ అతడికి అంత రాళంలో ఎక్కడో సిగ్గుకూడా కలిగింది

పెళ్ళి ఇక రెండురోజు లుంది.

రత్నమాల పడుకునిఉన్న భర్తదగ్గరకు వెళ్ళి "బట్టలు సర్దుతాను. మీరూ పిల్లలూ వెళ్ళండి పెళ్ళికి,'' అంది.

అతను పక్కమీద వత్తిగిలుతూ, "నువ్వు రావాఏం? నువ్వేం తప్పు చేశావు?" అన్నాడు.

ఆమాటలు విన్న ఉమ అక్కడకు వచ్చి. ''నువ్వుకూడా రా పిన్నీ. వెడితే అందరమూ వెడదాం; వెళ్ళకుండా ఎట్లాగుంటాం?" అంది.

''నేను ఆ అభిమానం చూపించగలిగితే చాలు ఉమా" అంది, రత్న కళ్ళు ఆర్ద్రమవుతుంటే.

ఈసారి ఉమే పిన్నిభుజంమీద చేయి వేసింది.

"నాకు తెలుసు పిన్నీ! ఎవరి కెవరు రాసిపెట్టారో మనకి తెలియక దుఃఖ పడుతుంటాము. మనచేతుల్లో లేదు అది. అందుకని మీపై అభిమానం వదలుకుంటా ననుకోకు. నాకు ఇప్పుడు ముఖ్యంగా కావలసింది మీ అభిమానమే. నేను బాధపడటంలేదు," అంది.

పెళ్ళికి అందరూ వెళ్ళారు.

* * *

రాత్రి ముహూర్తం పొద్దున్న స్నాతకం అవుతోంది. విడిదికి వెళ్ళటానికి ఆడపెళ్ళివారు ముస్తాబవుతున్నారు. ఉమ నీలం పట్టుచీర, అదే రంగు బ్లౌజు వేసుకుంది వదులుగా ఒక జడ అల్లుకుంది. మెడలో ముత్యాలు పెట్టుకుంది. శేఖర్ బొంబేవించి వచ్చాడని వింది

'వస్తే రానీ, నాకేమిటి?' అని విరక్తిగా అనుకుంచి. తలలో పూలు పెట్టుకుంది. కళ్ళకు కాటుక పెట్టుకుంటూ 'వ్యర్థమైన అందం,' అని తనను తను నిందించుకుంది

తిలకం దిద్దుకుంటోంది నిలువు టద్దంలో వెనక నీడ కదలింది తెల్లటి దుస్తులలో ఎవ రతడు! గుండె తీవ్రంగా కొట్టుకుంటూంటే వెనుతిరిగిచూసింది

శేఖర్ ఆమెనే చూస్తూ .. "ఎట్లాగున్నావ్... ఉమా... " అని. 'ఎట్లాగుంటే నేం బావా, దూరమయ్యాక.' అని ఆమె మనసులో అనుకుంటూంటే "సరే అడగట మెందుకులే ... కనిపిస్తున్నావు ...'' అన్నాడు నవ్వుతూ

కొడుకుని డ్రెస్ చేస్తున్న రత్నమాల అతడిని పలకరించింది; జవాబు చెప్పాడు ఆడవాళ్ళు అలంకరించుకుంటున్నారా గదిలో .. ఎక్కువసేపు నిలబడక వెళ్ళిపోయా డతడు.

'పలకరించటానికి వచ్చాడు.' అను కుంది ఉమ చెదరిన మనసులాగ కాటుక హద్దులు దాటివచ్చింది దుఃఖపడకూడ దనుకున్న నిర్ణయ మేమైపోయిందో — మొహం వివర్ణమైపోయింది

గిరిజ వచ్చి "పద ఉమా! విడిదికి వెడదాం," అంది

కాటుక సర్దుకుని వెళ్ళింది ఉమ.



రాత్రి పెళ్ళి అవుతోంది, వసంత వెనుక కూర్చున్నారు ఉమ, గిరిజ. పెళ్ళికొడుకు వెనకవైపు నిలబడి మగపెళ్ళి వారితో మాట్లాడుతున్నాడు శేఖర్. వసంత అన్న ప్రసాద్, ఉమ తమ్ముడు మురళీ ఫొటోలు తియ్యటంలో నిమగ్నులై ఉన్నారు. శేఖర్ మధ్యమధ్య ఉమవైపు చూస్తున్నాడు. మంత్రాలు, మేళాలు మారు మ్రోగుతున్నాయి పందిట్లో. ముహూర్తం ఆయింది. మంగళ

సూత్రధారులు అయింది. తలంబ్రాలు అవుతుంటే. 'ఆనంద మానంద మాయెనే' వాయిస్తున్నారు మేళగాళ్ళు. సంతోషము, ఉత్కంఠ, గాంభీర్యం మేళవించుకుని మంగళవాయిద్యాలు మ్రోగుతుంటే లోపల చెలరేగిన ఉద్వేగం నిలువనీయకపోగా, కూర్చున్న చోటనుంచి లేచి, పందిరి దాటి వరండాలోకి వెళ్ళి సోఫాలో కూర్చుంది ఉమ. కళ్ళు మూతలుపడ్డాయి. అది దుఃఖమూ కాదు, కోరికాలేదు, నిరాశాలేదు. ఒక నిరామయ పరిస్థితి. చెవులకి మంగళ వాయిద్యాలు దూరంగా వినిపిస్తున్నాయి. ఔను, తను అన్నింటికీ దూరమై పోయింది...ఈ ప్రపంచానికీ, దానిలో ఉన్న సుఖదుఃఖాలకీ ...

''ఇక్కడ కూర్చున్నావెందుకు ఉమా?'' అన్నాడు శేఖర్. దగ్గరగా వినిపించిన ఆ కంఠం విని ఉలికిపడింది ఉమ.

''తడబాటు చెందుతూ తలెత్తి, "ఊరికేనే, ఊరికేనే..." అంది ఉమ

వరండా స్తంభానికి ఆనుకుని నిలబడ్డాడు శేఖర్. మెల్లగా నవ్వి, "ఊరికే కాదు. ఆ వాయిద్యం కన్నె మనసుని కలలలోకి ఎత్తేస్తుంది. ఏం కలలు కంటున్నావూ!'' అన్నాడు.

ఉమమొహం ఎర్రబడింది. ''లేదు; కలలు కనే స్థితిలోలేను నేను. ఆడపిల్లలు అంతత్వరగా మనసు మరల్చుకోలేరు...'' అంది.

"మనసు మరల్చుకోరు కానీ, పెళ్ళి చేసుకుని ఇంకొకడిని దౌర్భాగ్యుణ్ణి చెయ్యడానికి సిద్ధపడతారు కదూ!" అన్నాడు నిదానంగానే శేఖర్.

ఉమకి ఉద్రేకం కలిగింది. "నన్ను పెళ్ళిచేసుకునేవాడు ఎప్పటికీ దౌర్భాగ్యుడుకాడు. నాకూ అభిమానం ఉంది. నిండుగుండే, అనురాగం ఉన్నాయి. కట్నాలు పేరుప్రతిష్ఠలు చూసి వచ్చేవాడు కాక, నన్నుకోరి వచ్చేవాడికి అవి ఇచ్చుకుంటాను. చాలామంది కాకపోయినా మా నాన్నలాంటివారు ఒకరిద్దరుండకపోరు. అటువంటివాళ్ళనే వెతుక్కుంటాము." అంది

"ఎంత అభిమానం! నా దగ్గర కూడానా ఉమా!" అన్నాడు.

ఉమకి దుఃఖం పొర్లివచ్చింది. "ఔను. నీదగ్గరకూడాను. నువ్వేమౌతావు నాకు! ఎందుకీ వృథాప్రశ్నలు. అత్తయ్య గిరిజని నీకు చేసుకుంటా. ని నిర్ణయించుకుంది ..." అంది

"ఎందుకా? నీదగ్గర ఉండన్నావే ఆగుండె నాకు కావాలి. పిచ్చిదానా! ఏ పురుషుడైనా భార్యలో ఏం కోరతాడను కున్నావ్. నేను నిన్ను వదలుతాననే అను కున్నావా? నువ్వు అన్నావే ఆ అనురాగమే కావాలి నాకు..."

ఉమ తన అభిమానం, నిర్ణయం అన్నీ

మరిచిపోయింది. ఆక్షణంలో. "అంతా నీకోసమే బావా! నేనే నీకోసం. లేకపోతే నాకు దుఃఖమే మిగుల్తుంది." అంది.

తన అలంకరణ ఒకసారి అద్దంలో సరిదిద్దుకోటానికి లోపలికి వెడదామని వచ్చింది గిరిజ. మెట్లదగ్గరే ఆగిపోయింది, వింటూ.

శేఖర్ నిదానంగా అన్నాడు: "నేను నిన్నే పెళ్ళి చేసుకుంటాను ఉమా!"

ఆమాటలకి మనసునిండా విషాదం కమ్ముకుంది ఉమకి. "నన్నెందుకు అవమానిస్తావు బావా! మనసు ఉంటే చాలదు. కావలసింది పెళ్ళి." అని లేచి ఉమ పందిట్లోకి వెళ్ళింది. కళ్ళల్లో నీటి పొరలు చేరి పెళ్ళిపందిరంతా మసక మసకగా కనిపించింది.

మరునాడు సాయంత్రం ఇంకా జరగవలసిన వేడుకలు ఉన్నాయి. పెద్ద హాలులో వధూవరులు మధుపర్కాలు ధరించి కూర్చున్నారు. యువకబృందమంతా అక్కడచేరి సందడి చేస్తున్నారు కాఫీలు త్రాగుతూ. గిరిజ పెళ్ళికొడుక్కి కాఫీ అందించింది.

"ఇన్నిసార్లు త్రాగను; వద్దు." అన్నాడతడు.

"త్రాగండి," అంది వసంత అనునయంగా, తను తాగుతూ.

చెవులకున్న ముత్యాల జూకాలు కదులాడుతుంటే నవ్వుతూ అంది గిరిజ: "మీరు తాగాల్సిందే. అక్కయ్య ఆజ్ఞాపించింది. మా అక్కయ్య చెప్పినట్లు చెయ్యాల్సిందే మీరు. మిమ్మల్ని పదివేలకి కొనేసింది అక్కయ్య."

కూర్చున్న యువకబృందమంతా నవ్వింది. ఆ సందడిలో పెళ్ళికొడుకు మొహం తెల్లబడటం ఎవరూ గమనించలేదు

"గిరిజా! ఇటురా." అని శేఖర్ పిలిచాడు.

వయ్యారంగా నడిచివచ్చి, "ఎందుకండీ బావగారూ?" అంది గిరిజ మార్యాద నటిస్తూ.

"మీ రిష్టపడి ఇస్తేనే పుచ్చుకున్నాడు పదివేలు. కొనేసుకుంది సరే; మరి జీవితాంతం పోషిస్తుందా?"

"పోషిస్తుంది. నెలకి వచ్చే వెయ్యి రూపాయిలజీతం, కారు, బాంకు ఎకౌంటు అన్నీ ఆవిడ చేతుల్లో ఉంటాయి. ఎందుకు పోషించదూ!" అంది గిరిజ.

"సరే. ఉద్యోగం మానేస్తాడనుకో... కాలు విరుగుతుం దనుకో—పోషిస్తుందా? ఆ పదివేలతో జీవితం గడిచిపోతుందా?"

"పో బావా! నీకు వేళాకోళమైనా తెలీదు. భర్తమీద ఆమాత్రం అధికారం ఉండదేమిటి భార్యకి!"

"ఉండచ్చు. ఆ భర్తకి ఇష్టమైతే," అన్నాడు శేఖర్.

ప్రసాద్ నవ్వి, "తెలుసుకో. నీమీద అధికారం ఉంటుందని ముందరే చెపు

తోంది. నువ్వూ ఒప్పుకున్నావు ...:" అన్నాడు.

ఉమకూడా అక్కడే ఉంది. ఆమె చెవులా సంభాషణని శ్రద్ధగా వింటు న్నాయి.

"కానీ నామీద అధికారం చేసే అమ్మా యిని నేను పెళ్ళి చేసుకోను. నేనూ భార్యమీద అధికారం చెయ్యాలని అనుకోను," అన్నాడు శేఖర్.

ఉమతమ్ముడు మురళి అందుకుని. "నువ్వేమనుకుంటే నేం? అత్తయ్య గిరిజని చేసుకుంటానంది," అన్నాడు.

శేఖర్ నవ్వాడు. "అయితే అమ్మ గిరిజని చేసుకుంటుంది. ఏం గిరిజా మా అమ్మ నీకు నచ్చిందా?" అన్నాడు.

గిరిజ ఊరుకోలేదు. "పోనీ, నీకు ఎటువంటిది నచ్చుతుందో చెప్పు. లేవగానే నీపాదాలు కళ్ళకద్దుకుని, పని చేసేదానిలాగ అణిగి పడిఉండేదా? చాలా విశాలహృదయుడివి," అంది.

శేఖర్ అరనిముషం ఆగాడు. "నాకు ఒకరు నచ్చాల్సిన అవసరంలేదు. నేను ఎవర్ని పెళ్ళి చేసుకుంటానో అందరికీ తెలిసినదే. ఉమని చేసుకుంటాను." అన్నాడు.

"ఉమనా! అత్తయ్య ఒప్పుకోని ఉమనా!" అని అక్కడనుంచి దూకుడుగా వెళ్ళిపోయింది గిరిజ.

అదిరిపడింది ఉమ. కూర్చున్నచోటు నుంచి లేచి, "పరిహాసంకాదు ఇది. అటు మీ అమ్మనీ, ఇటు మా నాన్ననీ అవమా నిస్తున్నావు బావా!" అని విసవిస నడిచి వెళ్ళింది ఆగదిలోంచి.

గిరిజవెళ్ళి తల్లిమీద విరుచుకుపడింది. "ఆ బావని చేసుకోనమ్మా!" ఆ సంఘ టన అందరినీ కదిలించింది.

"ఉమ అంటే నాకుమాత్రం ఇష్టం లేదా! పెళ్ళి అంటే మంచీచెడ్డా ఆలో చించాలి. గోపాల్‌మాత్రం ఎవరిని అడిగి చేసుకున్నాడా పెళ్ళి. నన్ను అడిగాడా?" అంది సావిత్రమ్మ.

భార్యమాటకి వ్యతిరేకంగా ఏదీ చెప్పలేదు శేఖర్‌తండ్రి.

"అయిందేదో అయిపోయింది. శేఖర్ ఉమనే చేసుకుంటానంటున్నాడు. అందరమూ ఒప్పుకుంటే మంచి" దన్నారు మాధవరావుగారు.


"అక్కయ్య ఒప్పుకుంటేకానీ ఉమని శేఖర్‌కి ఇవ్వలేను." అన్నారు గోపాల కృష్ణగారు.

సావిత్రమ్మగారు తన పట్టు వదల లేదు. "గిరిజ కాకపోతే ఇంకొక సంబంధం చూస్తాను." అంది.

"అమ్మా, నా పెళ్ళిమీద ఆశలన్నీ వదలుకో," అన్నాడు శేఖర్ చివరికి.

తను ఊరికి వెళ్ళాలి. సామాన్లు సర్దు తోంది ఉమ. రత్నమాల వచ్చి "శేఖర్ నీతో మాట్లాడతాడుట." అని వెళ్ళి పోయింది.

ఉమ సామాన్లు వదలివెళ్ళి కిటికీ




దగ్గర నిలబడింది. శేఖర్ లోపలికి వెళ్ళాడు. ఉమ సూటిగా అతడి ముఖంలోకే చూస్తూ నిలబడింది.

"మనం రిజిష్టర్డు మారేజ్ చేసుకుందాం," అన్నాడు శేఖర్ మెల్లగా, స్ఫుటంగా.

ఒక నిముషం అట్లాగే మౌనంగా నిలబడింది ఉమ. "లోకంలో వెన్నెలే కాదు, నీడకూడా ఉంది బావా। మా నాన్న ఒకదీపం వెలిగించాడు. ఆ నీడ నామీద పడింది. అలా గవుతుందని ఆయన ఊహించి ఉండరు ఆ నీడలోనుంచి నన్ను బైటికి లాగాలని చూస్తున్నావు నువ్వు. నేను కృతజ్ఞురాలినే, కానీ బావా... ఈవిధంగా పెళ్ళి చేసుకోవటం నాన్నని అవమానించినట్లే అవుతుంది. కూతురుగా నాన్న అభిమానాన్ని రక్షించవలసిన బాధ్యత నాకు ఉంది... కేవలం ప్రేమ అయితే ఆలోచించవలసిం దేమీ లేదు..." అంది.

"నీకేనా అభిమానం। అమ్మమాట నేను కాదనలేదా? ఎందుకోసం? నీకోసం... ఉమా।" అన్నాడు శేఖర్.

భరించలేను అన్నట్లు తల ఊచింది ఉమ. "నీడలనుంచి తప్పించుకోవాలని చూస్తాము కానీ అవి ఏదో ఒక రూపంలో మనని వెంటాడుతూనే ఉంటాయి. సుఖపడలేం. అత్తయ్య ఇష్టంలేకుండా పెళ్ళికి ఒప్పుకోలేను," అంది.

"అమ్మసాంప్రదాయాల్ని మూర్ఖంగా

పట్టుకుని వ్రేలాడే పాతకాలపు మనిషి. ఇంతకంటె గత్యంతరంలేదు ఉమా! నువ్వుకూడా మూర్ఖిస్తే మిగిలేది దుఃఖమే. ఆలోచించు," అన్నాడు శేఖర్.

"నా నిర్ణయం జరిగిపోయింది." అంది ఉమ

శేఖర్ వెళ్ళిపోయాడు. రత్నమాల వచ్చి పలకరించేదాకా అట్లాగే నిలబడి పోయింది ఉమ.

*　　*　　*

బొంబేలోనే చదువుపూర్తిచేసి అక్కడే ఉద్యోగంలో స్థిరపడ్డాడు శేఖర్. ప్రసాద్ కూడా బొంబేలోనే చదువు తున్నాడు. ఇద్దరూ కలిసి ఒకే ఫ్లాట్ లో ఉండేవారు ఏవో సంబంధాల వివరాలతో ఉత్తరాలు వస్తుండేవి తల్లిదగ్గరనుంచి. శేఖర్ జవాబులు రాసేవాడు కాదు

"పోనీ మన ప్రతిభని పెళ్ళి చేసుకో, ఏపేచీ ఉండదు. నన్ను అడిగితే బంధువు లలో ఎవర్నీ పెళ్ళి చేసుకోకూడదు అంటాను," అనేవాడు ప్రసాద్.

"ప్రతిభ చాలా మంచిది," అనేవాడు శేఖర్.

చాలారోజులు గోపాలకృష్ణగారు ఉమ పెళ్ళిగురించి ఏప్రయత్నమూ చెయ్యలేదు కానీ ఆయన స్నేహితు డొకడు తన కొడుకుకు ఉమని చేసు కుంటానని తనంతట తనే చెప్పాడు. అది అన్నివిధాలా మంచి సంబంధం. అయినా లోపల జంకుతూనే ఉమకి ఆసంగతి చెప్పింది రత్నమాల. వెంటనె ఒప్పుకుంది ఉమ.

"నేను పెళ్ళి చేసుకోను. ఇట్లాగే ఉండిపోతాను," అనికూడా అనలేదు యధావిధిగా పెళ్ళి చూపులు జరిగాయి. పెళ్ళి నిశ్చయమైంది

"నీకు ఇష్టమేకదూ! అంగీకరించి నట్లు వాళ్ళకి రాయమంటావా?" అని రత్నమాల అడిగినప్పుడు, అంగీకార సూచకంగా తల ఊపింది ఉమ.

'అంతా అయిపోయింది. నాచేతులు దాటిపోయింది,' అనుకుంది. అనుకోగానే అంతవరకూలేని సంచలనం ప్రారంభ మయింది ఉమలో.

ఆసమయంలో సెలవలకి ఇంటికి వొచ్చాడు ప్రసాద్. తనతో ఒకవార్త కూడా మోసుకొచ్చాడు. 'ప్రతిభ' అనే మరాఠీ అమ్మాయిని శేఖర్ పెళ్ళి చేసుకుంటాడని. ఆవార్త త్వరలోనే బంధువర్గంలో వ్యాపించింది

ఈ విషయం సావిత్రమ్మగారు కూడా వింది: కాని ఆవిడ నమ్మలేదు ప్రసాద్ బొంబేనుంచి వచ్చిన వారానికే అక్కడి నుంచి సావిత్రమ్మగారికి వైర్ వచ్చింది. "శేఖర్ కి సుస్తీగా ఉంది, వెంటనే రావాలి – ప్రతిభ." అని.

సావిత్రమ్మగారూ, శేఖర్ తండ్రి కృష్ణమూర్తిగారూ వెంటనే మాధవరావు గారి దగ్గరకు వెళ్ళారు. అక్కడినుంచి ప్రసాద్ ను తీసుకుని బొంబే వెళ్ళారు.

"అప్పుడు నేను చెప్తే విన్నావా? నాకే నీతులు బోధించావు. కానీ ఇప్పుడు నే నేం చెయ్యలేను ఉమా ప్చ్; ఆ ఒప్పుకున్న పెళ్ళే చేసుకో. ఏం చేస్తాం? మన చేతులలోలేదు. వారం రోజులనుంచీ జ్వరంతోపడి ఉన్నాను నేను. నేను చేయగలిగింది ఏమిలేదు "

గదిలో మాటలు వినిపించి తలుపు దగ్గర ఆగిపోయింది ప్రతిభ. గదిలో ఎవరూ లేరు. శేఖర్ మంచంమీద పడుకునేఉన్నాడు. తనలో తను సన్నగా నవ్వుకుంటున్నాడు చేతిలో ఉత్తరం ఉంది. ఆ ఉత్తరం చూసి త్రాగినవాడి లాగ నవ్వుతూ పైకి మాట్లాడు తున్నాడు. ప్రతిభ లోపటికి వెళ్ళింది.

"ఎవరితోనో మాట్లాడుతున్నా వను కున్నాను. ఉత్తరం ఎక్కడినుంచి? ఏమిటి సంగతి?" అని ప్రశ్నించింది కుర్చీలో కూర్చుంటూ.

ప్రతిభకి తెలుగువచ్చు. అర్థ మవు తుంది కానీ మాట్లాడలేదు. ఇంగ్లీషు లోనే మాట్లాడుతుంది ఆమె ఆ ఇల్లు గలాయన కూతురు. క్రింది రెండు ఫ్లాట్లూ అద్దెకిచ్చి వాళ్ళకుటుంబం పయి ఫ్లాట్ లో ఉంటారు. ఉద్యోగం చేస్తూ ఎం ఏ. చదువుతోంది ప్రతిభ. షుమారుగా ఆమెకి శేఖర్ వయసు ఉంటుంది. శేఖర్ ప్రసాదులు మూడేళ్ళనుంచీ ఆ ఇంట్లో ఉన్నారు. ప్రతిభతో బాగా పరిచయం ఏర్పడింది. పైకి వెడుతూ వస్తూ రోజూ వాళ్ళని పలకరిస్తూ ఉంటుంది. ముగ్గురికీ కూడా టేబుల్ టెన్నిస్ అంటే ఆసక్తి ఉంది. క్లబ్ లో ఆడుకుంటారు. తరచూ వాళ్ళింటికి టీకీ భోజనానికీ వెడుతూనేఉంటారు శేఖర్ ప్రసాదులు.

ప్రసాద్ ఊరికి వెళ్ళాడు. శేఖర్ జ్వరం వచ్చి లేవలేకుండా ఉన్నాడు. డాక్టర్ని ఫోనుచేసి పిలిచింది ప్రతిభ. డాక్టర్ టైఫాయిడ్ అన్నాడు. అప్పటికే వారం గడిచింది.

''భయ మేమీలేదు; పది రోజుల్లో పూర్తిగా నయమౌతుంది. అయినా వాళ్ళవాళ్ళని పిలిపించండి." అన్నాడు డాక్టర్.

శేఖర్ ఇంటికి వైర్ ఇచ్చింది ప్రతిభ శేఖర్ కి సదుపాయాలు చూడటం, సంరక్షణాభారం తమపై వేసుకున్నారు ప్రతిభావాళ్ళ కుటుంబం. అయినా శేఖర్ తన కుటుంబవిషయాలు వాళ్ళతో ఎప్పుడూ మాట్లాడలేదు.

ప్రతిభ కుర్చీలోకూర్చున్నాక, శేఖర్ బలహీనంగా నవ్వుతూ, "ఔను; ఉమతో మాట్లాడుతున్నాను. ఉమ నాకు ఉత్తరం రాసింది. తను నాకు మరదలు; నేను పెళ్ళిచేసుకోవలసింది. అమ్మవలన తప్పి పోయింది. ఉమతండ్రి విదోమారేజ్ చేసుకున్నాడు—అందుకని." అన్నాడు.

"ను వ్వింత బలహీనుడివి అనుకో లేదు.'' అంది ప్రతిభ.

"నేను బలహీనుడనైతే ఇట్లాగ ఎందుకు ఉంటాను! దేవదాసు బిరుదు వహించి, బుడ్డీలు సేవిస్తూ..."

"వెళ్ళు, ఉమని పెళ్ళి చేసుకో..." అంది ప్రతిభ.

"నేనా! ఎందుకు వెళ్ళటం? దారిలో నడుస్తున్న బండిని బోల్తా కొట్టించ డానికా! ఉమసంగతి నీకు తెలియదు. ఈ ఉత్తరం చూచుకుని నేను వెళ్ళాననే అనుకో. నన్ను చూసి 'ఎందుకు వచ్చావు బావా! వెళ్ళిపో. క్షణికావేశంలో పొర పాటు పడి రాశాను. వెళ్ళిపో బావా!' అంటుంది. ఈపాటికి ఆ దుఃఖంలోంచి తేరుకుని ఉంటుంది. ఉమ ఎప్పటికీ ఆత్మహత్య చేసుకోదు. వాళ్ళ నాన్నకి అవమానం కలగనీయదు. ఇప్పుడు పెళ్ళికి సిద్ధపడుతూవుంటుంది. నేను వెడితే జరిగేది అంతే," అన్నాడు శేఖర్. అతడి చేతిలో ఉత్తరం అందు కుంది ప్రతిభ.


"బావా! మనిషిని విచలితం చేసే టటువంటి దుఃఖం నాకు అనుభవనీయ మైంది. పెళ్ళి నిశ్చయమైపోయింది. కానీ, ఈ పెళ్ళి నుంచి ఎక్కడికైనా పారిపోవాలని నా సర్వస్వం ఆక్రోసి స్తోంది. 'నేను పెళ్ళి చేసుకోను ఇట్లాగే వుండిపోతాను' అని చెప్పగల పరి స్థితిలో కూడా లేను నేను. తన కారణంగా నేను అవివాహితగా వుండిపోవటం నాన్న సహించగలరా! నాన్నకోసం నా అనేది అంతా వదులుకోవాలనుకున్నాను. వదులుకోగల ననే అనుకున్నాను. కానీ ఈ క్షణాలలో నాలో స్థయిర్యం, శక్తి సన్నగిలిపోయాయి. ఇట్లాగ బ్రతికే కంటె మరణించటం చాలా తేలిక. కానీ అది కూడా చెయ్యలేను— నాన్నకోసమే. ఇది పతనం అని తెలుసు కానీ పతనం నుంచి కాపాడుకోగల శక్తి నాలో పోయింది ఈ పెళ్ళి నేను చేసుకోలేను. ఆ రోజు నువ్వు అంటే కాదన్నాను. కానీ అంతకంటె గత్యంతరం లేదు. పెళ్ళిరోజు దగ్గరకు రాకుండా నువ్వు వచ్చినా సరే; లేదా నీ దగ్గరకు నేను వస్తాను.

——ఉమ."

ఉత్తరం మడిచి దిండుక్రింద పెట్టింది ప్రతిభ. శేఖర్ దిండు కానుకుని కూర్చు న్నాడు. "అవకాశం ఇస్తే వదులుకుని, తరవాత దుఃఖపడటం మగవాళ్ళ కంటె ఆడవాళ్ళకే బాగా చేతనవును. ఏ పరి స్థితిలోనైనా ఉమనే పెళ్ళి చేసుకుందా మనుకున్నాను. కాలం ఉమ చుట్టూ ఒక సమస్య గీసి సవాలు చేసి నవ్వింది." అన్నాడు.

"నీ కాప్సూల్‌కి వేళ అయింది" అని మందు ఇచ్చింది ప్రతిభ. "నేను సలహా ఇవ్వనా? ఒక బెంగాలీ అమ్మాయిని పెళ్ళిచేసుకో," అంది వెడుతూ.

మనసులో ఆదుర్దా వున్నా, రైలు దిగి స్టేషనులో అడుగు పెట్టినప్పటి




నుంచీ సావిత్రమ్మగారు పట్నపు హడావిడిని కుతూహలంగా పరిశీలిస్తూనే వుంది. టాక్సీలో ఇల్లు జేరి, మెట్లు ఎక్కి పైకి వెళ్ళారు. కొడుకు గదిలో అడుగు పెట్టగానే—

శేఖర్ మంచంమీద దిండు కానుకొని కూర్చునివున్నాడు. అక్కడే ఒక కుర్చీలో శుభ్రంగా, అంతకంటె పరిశుభ్రమైన దుస్తులలో ప్రతిభ కూర్చుని వుంది. శేఖర్ ఏదో మాట్లాడుతున్నవాడు ఆగి, "లోపలికి రా అమ్మా! రండి నాన్నగారూ..." అన్నాడు.

"ఈవిడ శేఖర్ తల్లి!" అని ప్రసాద్ ప్రతిభకి పరిచయం చేశాడు.

"ప్రతిభ సావిత్రమ్మకి నమస్కారం చేసి, ప్రసాద్‌వైపు తిరిగి, "దయచేసి పైకి వెళ్ళి మా ఆచారితో నాలుగుకప్పుల కాఫీ పంపించమన్నానని చెప్పు," అంది.

ప్రసాద్ వెళ్ళిపోయాడు.

సావిత్రమ్మగారు, ఆవిడ భర్త కృష్ణమూర్తిగారూ కూర్చున్నారు.

"నిన్నా, ఇవేళా టెంపరేచర్ ఇంకొంచెం తగ్గిందండి. డాక్టర్ కూడా ఇంక నయమైపోతుందని చెప్పాడు," అంది ప్రతిభ.

కృష్ణమూర్తిగారు తల ఊపి ఊరుకున్నారు. అందరూ కాఫీలు త్రాగాక, శేఖర్‌కి హార్లిక్స్ కలిపి ఇచ్చింది. ఏ వేళకు ఏ మందులు వెయ్యాలో ప్రసాదుకి అప్పగించి, "నేను మళ్ళీ వస్తా. రాత్రికి మి అందరికి భోజనం మా ఇంట్లోనే," అని చెప్పి వెళ్ళిపోయింది ప్రతిభ.

'శేఖర్ ఈ అమ్మాయిని పెళ్ళి చేసుకోలేదు గదా!' అని అనుమానం

వచ్చింది సావిత్రమ్మకి. ఆవిడ మనసులో ఆరాటం కలిగింది.

"నేను ఇక్కడే వంట చేస్తానని ఆ అమ్మాయితో చెప్పు." అని ప్రసాద్‌ని పంపించింది. తరువాత - ఆవిడ శేఖర్ పరిచర్యలో పడిపోయింది.

ఆ మరునాడు కృష్ణమూర్తిగారికి ఊరు చూపించటానికి తీసుకువెళ్ళేడు ప్రసాద్.

ప్రతిభ వచ్చి శేఖర్‌ని పలకరించి మాట్లాడుతున్నంత సేపూ ఆవిడ వంట గది వదిలిరాలేదు.

"ఏమైనా కావాలా! బజారునుంచి కానీ, డాక్టర్ దగ్గరనుంచికానీ." అంది ప్రతిభ.

'ప్రసాద్ వచ్చాడు కదూ! ఇంక నిన్ను బాధపెట్టను," అన్నాడు శేఖర్.

"నేను మాత్రం ఇట్లాగ వచ్చి మిమ్మల్ని బాధపెడుతూనే ఉంటాను." అని నవ్వుతూ వెళ్ళిపోయింది ప్రతిభ. సావిత్రమ్మ అప్పుడు వంటగదిలో నుంచి వచ్చి కుర్చీని శేఖర్‌కి దగ్గరగా లాక్కుని కూర్చుంది.

"వాళ్లు మరాటీవాళ్ళా?" కొడుకును ప్రశ్నించిం దావిడ.

"ఔను, ఈ ఇల్లు వాళ్ళదే. ఆయనకి చాలా డబ్బు ఉంది. చాలా మంచిపిల్ల." అన్నాడు శేఖర్.

"అమ్మాయికి పెళ్ళయిందా ?"

"లేదు; నేను చేసుకోనా అమ్మా..." అన్నాడు నవ్వి.

"చాల్లే వేళాకోళం! ఎంత చదువు కుంటే మాత్రం. మర్యాదైనా లేకుండా ఇంత చనువా! అట్లా తిరిగితే తండ్రి ఊరుకుంటాడూ ... పెళ్ళికాని పిల్ల!"

"మర్యాద లేకపోవటమేమిటి! నాకు జబ్బు చేస్తే ఎంత మర్యాదగా చూశారు వాళ్లు. అప్పుడు మీరు ఎవరూ లేరమ్మా. స్వేచ్ఛగా ఉంటారనా! మనకి వంశం, సంప్రదాయం వుంటే, ప్రతివాళ్ళకి వాళ్ళ మనసుకిసంబంధించిన నీతి ఉంటుం దమ్మా. పాశ్చాత్యులలోనైనా పెళ్ళి అయ్యాక ఇంకొకడిని ప్రేమించటం, ప్రేమించని వాడిని పెళ్ళిచేసుకోవటం అన్నీతప్పులే. వాళ్ళ నీతివాళ్ళకి ఉంది" అన్నాడు.

"పోరా! వాళ్ళ నీతిని గురించి నాకు చెప్పకు." అని చిరాకుపడుతూ లేచి పోయిం దావిడ. శేఖర్ నవ్వుకున్నాడు.

ఆ సాయంత్రం బాల్కనీలో వచ్చి నిలబడిం దావిడ, రోడ్డువైపు చూస్తూ. ప్రసాద్‌కూడా ఆవిడపక్కన నిలబడ్డాడు. అంతలో క్రిందివాళ్ళ గార్డెనులో కల కలం వినిపించింది. ఆమె దృష్టి అటు మళ్ళింది. లానులో కుర్చీలు వేసుకుని టీ త్రాగుతున్నారు ఆ కుటుంబం. భార్యా భర్తా, ఇద్దరు పిల్లలూ. ఆవిడ ఫ్రాకు వేసుకుని ఉంది అతను సూటులో ఉన్నాడు.

ఆ దృశ్యం సావిత్రిమ్మగారికి కుతూహలం కలిగించింది. "ఆవిడ ఎవరు? వాళ్ళేజాతిరా ప్రసాద్?" అని ప్రశ్నించింది.

ప్రసాద్ మెల్లగా నవ్వుకున్నాడు.

"వాళ్ళు పార్శీవాళ్లు. ఆవిడా ఆయనా భార్యాభర్తలు. ఆ పెద్దపిల్ల ఆవిడ మొదటి భర్తకి పుట్టిన కూతురు. అతడు పోతే యీ వితంతువుని ఈయన పెళ్ళి చేసుకున్నాడు. వీళ్ళ కొడుకు ఆ రెండేళ్ళ అబ్బాయి," అని వివరంగా చెప్పాడు.

తరువాత ఆ కుటుంబాన్ని చూస్తుంటే ఆవిడలో జుగుప్స కలిగింది. ఇట్లాగ ఉంది ప్రపంచం! అని ఆవిడకి విచారం కలిగింది. ఒక విషయాన్ని గురించి వినటం వేరు, చూడటం వేరు; రెండూ వేర్వేరు అనుభవాలు. ఆవిడ తన పరిధి దాటివచ్చి ఆలోచించటము మొదలు పెట్టింది. 'శేఖర్ ఆ మరాటీపిల్లను చేసుకుంటాడా?' అనే భయం ఆవిడలో ఇది వరకే ఉంది. 'మరి ఉమ చేసిన తప్పేమిటి? అయినవాళ్ళందరినీ బాధ పెట్టి నేను చేసిన నిర్వాహకం ఏమిటి?' అని ప్రశ్నించుకుంది.

ప్రసాదూ కృష్ణమూర్తిగారూ ఊళ్ళోకి వెళ్ళారు. తండ్రికి ఊరు చూపించమన్నాడు శేఖర్. ప్రసాద్ ఆయనని రోజూ కొకచోటికి తీసుకువెడుతున్నాడు. అప్పుడే ప్రతిభ వచ్చివెళ్ళింది. సావిత్రమ్మగారు శేఖర్ దగ్గరకు వచ్చి కూర్చుంది. శేఖర్ దిండుకానుకుని కూర్చున్నాడు. అతడికి పూర్తిగా నయమైంది; కానీ ఇంకా బలహీనంగా ఉన్నాడు. తల్లి మాట్లాడకుండా కూర్చోవటం చూసి, "ఏమిటమ్మా, ఆలోచిస్తున్నావూ?" అన్నాడు శేఖర్.

"ఏం లేదు శేఖర్! నీకు పెళ్ళి చేస్తే నాకింక ఏదిగులూ ఉండదు," అందిఆవిడ.

"అమ్మా, ఉమ ఉత్తరం రాసింది," అన్నాడు శేఖర్ ఎటో చూస్తూ.

"ఏమని! ఏదీ..." అం దావిడ.

శేఖర్ అందించాడు.

ఉత్తరం ఆవిడ చదువుతూంటే, ఎన్నిమాట్లు చదివాడో – తల్లితోపాటు; ప్రతివాక్యం అతడూ మననం చేసుకున్నాడు. అతడికళ్ళల్లో నీళ్లు నిలిచాయి. కొడుకు– మగవాడు! శేఖర్ కళ్ళలో నీరు చూసి తట్టుకోలేకపోయిం దావిడ.


చటుక్కున లేచి కొడుకుతలని గుండెల కదుముకుని "బాధ పడకు శేఖర్! నేను చెప్తున్నానుకదూ. ఉమకీ నీకూ పెళ్ళిచేసేస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు. నువ్వు కోలుకో," అందావిడ.

"ఉమ తొందరపడి.." అన్నాడు శేఖర్.

"నేను వెంటనే వెళ్ళిపోతాను. మామయ్యతో చెప్పి ఆ పెళ్ళి ఆపిస్తాను," అంది, పమిటకొంగుతో తన కళ్ళు తుడుచుకుంటూ.

'బావకి ఆట్లాగ ఉత్తరం రాయటం తప్పా? ~~నేను పెళ్ళి కాకముందు ఆఖరి~~ క్షణాలలో పడిన బాధని తెలుసుకుంటాడు. తప్పేమిటి? బావకి గాకపోతే ఎవరికి తెలపగలను! పోనీ, పతన మనుకున్న ఆ క్షణాలు గడిచిపోయాయి. నా మనసు ఇప్పుడు బాధ పడటంలేదు. బావ రాడు! మంచిపని చేశాడు. నాకు–సుఖదుఃఖాలూ, ఆశా నిరాశలూ బాధించని రాజమార్గం, ధర్మమార్గం ఎదురుకుండా ఉంది. నాన్న నిర్ణయించిన పెళ్ళి' అనుకుంటోంది ఉమ.

బండి దిగి లోపలికి వచ్చిన వ్యక్తిని



చూసి ఆశ్చర్యపోయారు గోపాలకృష్ణ గారూ, రత్నమాల.

"బొంబేనుంచి ఎప్పుడు వచ్చావు అక్కయ్యా! శేఖర్ కులాసా గా ఉన్నాడా?" గోపాలకృష్ణగారు ఆతృతతో అడిగారు.

ఆశ్చర్యంగా నిలబడిన ఉమ తల నిమురుతూ "నిన్ననే వచ్చాను. వాడు కులాసాగా ఉన్నాడు. ఉమని నా కోడల్ని చేసుకుంటానని చెప్పడానికి వచ్చాను," అంది సావిత్రమ్మగారు.